క్లుప్తంగా

అభినందన



చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన మన్నెం భూలక్ష్మీ–వాసు దంపతుల కుమారుడు మన్నెం అజయ్‌కుమార్ రెండు రోజుల క్రితం వెల్లడించిన యూపీపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 44వ ర్యాంక్ సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికైయ్యాడు. దీంతో శుక్రవారం కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ రాజ్‌మహ్మద్ హనుమకొండలో పూర్వ విద్యార్థి అయిన అజయ్‌కుమార్‌ను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆయన వెంట పాఠశాల డైరెక్టర్ హఫీజ్ ఉన్నాడు.

బీఎస్పీతోనే న్యాయం



కాటారం: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)తోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఇరికిళ్ల రాజనర్సయ్య అన్నారు. కాటారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజనర్సయ్య మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ బీఎస్పీ పార్టీ మాత్రమే అన్నారు. ఈ సమావేశంలో కాటారం మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ పేగె నరేశ్, అరికిల్ల మల్లేశ్, జనగామ రవికుమార్, బొంద్యాలు, రాజు, మహేశ్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

కాటారం(మహదేవపూర్): మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన వివాహిత అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వివాహిత గురువారం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదు. దీంతో వివాహిత భర్త గోపాల్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉపాధి హామీ కూలీ మృతి



ఓదెలు(ఫైల్)

చిట్యాల: ఉపాధిహామీ పనికి వెళ్లి అస్వస్థతకు గురై కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని గిద్దెముత్తారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన కనకం ఓదెలు (52) శుక్రవారం ఉదయం గ్రామంలోని గిద్దకుంట చెరువులో ఉపాధి పనికి వెళ్లాడు. పని ప్రదేశంలో బీపీ ఎక్కువ కావడంతో అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య స్వరూప, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



చిట్యాల: మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలు అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్‌లో సీపీఐఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్ల మోదీ రాక్షస పాలనలో అన్ని వర్గాలకు నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మహిళలకే పెద్దపీట వేసిందని, కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య, కె.రాజయ్య, ఆకుదారి రమేష్, శ్రీకాంత్, శ్రీధర్, రాజేందర్, స్వర్ణ, శారద, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, స్థానిక ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలోని పెద్దచెరువు వద్ద ఉపాధి హామీ కూలీలతో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేపట్టిన నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

చిట్యాల: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆమె మాట్లాడారు. పేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వరంగల్ ఎంపీగా తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దొమ్మాటి సాంబయ్య, జిల్లా, మండల నాయకులు రాంనర్సింహారెడ్డి, గూట్ల తిరుపతి పాల్గొన్నారు.

టేకుమట్లలో..

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. ఆడబిడ్డగా తనను ఆశీర్వదించి ఓటు వేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ పదేళ్లలలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసిందే ఎమి లేదని అన్నారు. మాయమాటలతో మీ ముందుకు వస్తున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: మండలానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి స్వగ్రామం మండలంలోని ధన్వాడలో శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు నూతనంగా చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొక్కల పోశిరెడ్డి, చీర్ల తిరుపతి, అయిత శకుంతల, సూరం సమ్మిరెడ్డి, బొమ్మన సంజీవరెడ్డి, బొడ్డు రాజబాబు, గొడిశెల రాజేశ్, సంజీవ్, కుమ్మరి అశోక్, లిక్కి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు తెప్పెల ప్రభాకర్‌రెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల మాలధారణ



హోమం చేస్తున్న గాయత్రి మాతాజీ, తదితరులు

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో హనుమాన్ భక్తులకు మాలదారణ వేస్తున్నట్లు విశాఖ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గాయంత్రి మాతాజీ తెలిపారు. శుక్రవారం గ్రామంలో హనుమాన్ సేవ సమితి అధ్యక్షుడు రావుల సాయిరెడ్డి ఆధ్వర్యంలో మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లోక కల్యాణం కోసం హనుమాన్ గాయత్రి మాత హోమం నిర్వహించారు. ఈ మేరకు గాయత్రి మాతాజీ, సాయిరెడ్డి స్వాములు సువృష్టి, సుఫల, ప్రశాంత జీవితంతో ప్రజలు జీవించాలని హోమంలో పూర్ణాఆహుతి పూజ కార్యక్రమం చేశారు. నేడు(శనివారం) కూడా దీక్ష మంత్రం, మాలధారణ ఉంటుందని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు దొంతి రాండరెడ్డి, డాక్టర్ సత్యం, భక్తులు పాల్గొన్నారు.

'పుట్ట మధు వ్యాఖ్యలు సరికావు'



మాట్లాడుతున్న నాయకులు

కాళేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ప్రభుత్వంపై మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పుట్ట మధు చేసిన వ్యాఖ్యలు సరికావని, పద్ధతులు మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు లేతకరి రాజబాపు అన్నారు. కాళేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం కార్నర్ మీటింగ్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీలు విఫలం అయ్యాయని అనడం హాస్యస్పందం అన్నారు. నాలుగు గ్యారంటీలు అమలు జరిగాయని, రుణమాఫీ ఆగస్టు 15లోపు అమలు చేస్తారని అన్నారు. బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుండడంతో మతి భ్రమించి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. మాజీ ఎంపీపీ సత్తమ్మ, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు సత్యనారాయణ, లక్ష్మీ, శకీల్, పవన్‌శర్మ, హైదర్, నగేష్, ఎం.సారయ్య, ఏ.సారయ్య, మనోహర్, వెంకట్‌స్వామి, రాజబాపు, శేఖర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

సామాన్యులను విస్మరించిన ప్రభుత్వం



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



చిట్యాల: బైక్‌ర్యాలీ చేస్తున్న నాయకులు

రేగొండ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సామాన్యులను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు దమ్మన్నపేట, రూపిరెడ్డిపల్లి, రంగయ్యపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకుర్చుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, నాయకులు కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రహీంపాషా తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాటంలే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో పాటుతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అభివృద్ధి చెందిందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు, వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్ ముంజపల్లి మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సుధీర్ కుమార్‌ను గెలిపించాలని బైక్ ర్యాలీ

చిట్యాల: బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చింతల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని కైలాపూర్, సీఆర్‌పల్లి, తిర్మలాపూర్ చల్లగరిగ, జూకల్, గోపాలపూర్ తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల అభివృద్ధి కోసం పని చేసిందన్నారు. జంబుల చంద్రమౌళి, హరికృష్ణ, రాయమల్లు, తీగల బాలకృష్ణ, కంచర్ల కుమారస్వామి, శ్రీనివాస్, గణపతి, రాజయ్య, రాజు, నరేష్, సదయ్య పాల్గొన్నారు.

కొప్పులను అధిక మెజార్టీతో గెలిపించాలి

పలిమెల: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మండల ప్రజలు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని దమ్మూరు, బూరుగ్గూడెంలో జవ్వాజి తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల వద్ద కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా అనేక అభివద్ధి, సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్యం దుకాణాలు బంద్

48గంటల పాటు మూసివేత

కాళేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు (శనివారం)నుంచి సోమవారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలను 48 గంటల పాటు బంద్ చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న శనివారం సాయంత్రం 5గంటలకు మూసివేసి 13న పోలింగ్ ముగిసిన తరువాత సాయంత్రం 6గంటలకు తెరువనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, గొడవలు, ఘర్షణలు జరుగకుండా ముందస్తుగా ఎక్సైజ్, పోలీసుశాఖలు చర్యలు చేపట్టారు.

నీటి తొట్టె ఏర్పాటు

కాళేశ్వరం: ఎండలు మండిపోతుండడంతో పశువుల దాహం తీర్చేందుకు యువకులు నీళ్ల తొట్టె ఏర్పాటు చేశారు. శుక్రవారం మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో యువకులు కొట్టె రవీందర్, నిట్టూరి రాకేష్ తొట్టెలో నీళ్లు పట్టి పశువుల దాహం తీరుస్తున్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(ఎం): గొత్తికోయలు నాటు వైద్యాన్ని వీడనాడి ప్రభుత్వం అందించే మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల కేంద్రానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తొర్రి చింతలపాడు, రోలుబండ గొత్తికోయగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గొత్తికోయ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి 62 మందిని పరీక్షించి రక్తన మూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పుష్పకుమారి, ఎల్‌టీ ఎనబోతుల కృష్ణ, ఎఎన్ఎంలు స్వప్న, కనకలక్ష్మి ఉన్నారు.

మోదీ పాలనలో దేశం సుభిక్షం



భూపాలపల్లి రూరల్: ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు



రేగొండ: మాట్లాడుతున్న కీర్తిరెడ్డి



రేగొండ: మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

రేగొండ: మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని, పదేళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ప్రధాని మోదీకి మరోసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి అధ్యక్షతన విలేకరుల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడి, జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, దేశ రక్షణ కోసం నిధుల కేటాయింపుతో పాటు ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠాధామాలు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగయాన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ఓట్లడుగుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళి, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, కొత్తపల్లిగోరి మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు బుచ్చిరెడ్డి, లింగారెడ్డి, సరోత్తము రెడ్డి, తూర్పాటి మల్లేష్, రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి లేని పాలన మోదీతోనే సాధ్యం

భూపాలపల్లి రూరల్: దేశంలో అవినీతి లేనిపాలన ప్రధాని మోదీతోనే సాధ్యమని, మోదీ పాలనలోనే దేశం సురక్షంగా ఉంటుందని బీజేపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెన్నంపల్లి పాపయ్య తెలిపారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్ వ్యాపార సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు కన్నం యుగేందర్‌తో కలిసి పాపయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వంలో పది సంవత్సరాల పాలనకాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటే..

పలిమెల: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని లెంకలగడ్డ, పలిమెల, సర్వాయిపేట, మోదేడు గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాస శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వాడినని, అనేక మందితో తనకు ప్రత్యేక పరిచయాలు ఉన్నాయని గుర్తు చేశారు. తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.